# నమ్మండి - మానండి !

నలువేపులా నాలుకలు చాచి తన ప్రతాపం చూపిస్తు న్నాడు హుతవాహుడు. మండుతున్న చితికంటె ఎక్కువగా మండుతోంది నా హృదయం. నాతో ముప్పై ఐదు సంవత్స రాలకు పైగా కలసి మెలసి వుండి, నా కష్టసుఖాలు తనవిగా భావించి, నా శరీరంతోనే కాకుండా, హృదయానికీ, జీవితా నికీ కూడా అత్యంతాత్మీయురాలూ, అర్థాంగీ అయిన శ్రీలక్ష్మి ఈనాడు కాలి మసి అయిపోతోంది! ఆ శరీరాన్ని నే నెంత ప్రాణప్రదంగా చూచుకున్నానో ఒక్క నాకే తెలుసు! అయితే నేం? ఈనాడు నేనే నా శ్రీలక్ష్మి జీవంలేని శరీరానికి నిప్పం టించవలసి వచ్చింది!

"మీరూరికే బాధపడవద్దు... నేను చనిపోయినా నా ఆత్మ మీ వెంటే వుంటుంది అనుకోండి" అని చెప్పటానిగ్గాబోలు! శ్రీలక్ష్మి శరీరం ఒక్క ఉదుటున చితిలోంచి లేచింది... కాటి కాపరి క్రూరమైన కర్రదెబ్బతో తిరిగీ మంటల్లోకి వరిగిపో యింది. దుఃఖాగ్నిలో దగ్ధమయిన నాలో కన్నీళ్లుకూడా ఇగిరిపోయాయి!

"శర్మా! ఇక పదపోదాం! దుఃఖపడి లాభమేముం దయ్యా! ఈ జగమంతా మిథ్య బాబూ! మనమూ ఏనాడో

ఇలాగే కట్టెల్లోకి పోవాల్సిందే! అయితే ముందూ-వెనుకా, అంతే తేడా! ఈ మాత్రానికి ఇది నాదనీ, అది నాదనీ కొట్టుకు చస్తాం...ఏదీ వెంటరాదనీ తెలుసుకోవాలి. పద పోదాం!"

నిద్రలేచింది మొదలు, రాత్రి నిద్ర కుపక్రమించే క్షణంవరకూ, లోకుల్ని ముంచి డబ్బు సంపాదించటమే పనిగా వున్న వెంకటేశ్వర్లు నాకు వేదాంతం నూరిపోస్తున్నాడు. ఇంకో సమయంలో అయితే...

"ఆ మాటమీదే నిలబడి, కాస్త కుటిలనీతి చాలించరాదూ!" అనేవాణ్ణే! కానీ ఈ సమయంలో కనీసం నవ్వు కూడా రాలేదు...

బంధువర్గమంతా నన్ననుసరించారు. ఎవరినోటంట విన్నా శ్రీలక్ష్మిని గురించిన పొగడ్తలే! ఇదే కాబోలు "చచ్చినవాడి కళ్ళు చారెడు" అనే సామెత!

ఇంట్లో అడుగుపెట్టానో లేదో, స్మశాన వైరాగ్యం ఆవరించిన నాలో మళ్ళీ దుఃఖం గూడుకట్టుకుంది. లంకంత యిల్లు, కట్టుకుపోయేంత ఆస్తి, మూలలకు గిరాటు వేస్తుంటే ఎదురువస్తున్న పాతసామానులూ, ఇవన్నీ శ్రీలక్ష్మి లేకుండా నేనొక్కణ్ణే అనుభవించాలా? అసలు భరించగలనా? శ్రీలక్ష్మిపాదం పెట్టిన మరుక్షణంనుంచే నాకీ సిరిసంపదలు తరుముకు వచ్చాయి! అలాటి నా జీవనలక్ష్మి నన్నొదిలి వెళ్ళిపోతే నాకీ భోగభాగ్యాలతో పనేముంది? కానీ మనస్సింత త్వరగా ఇలాటి విషయాలకు ఒడంబబడదు. మనిషికి

బ్రతుకుమీదా, అందులోనూ సౌఖ్యప్రదమైన జీవితమంతా వున్నంత మరిదేనిమీదా వుండదు.

యాదృచ్ఛికంగా కర్మాంతరాలు జరిగిపోయాయి. వచ్చేవారు వస్తున్నారు. శ్రీలక్ష్మిని పొగడుతున్నారు. ఆవిడ చనిపోయినందుకు తమ సంతాపం వెలిబుచ్చుతున్నారు ... నన్ను ఓదారుస్తున్నారు. నాలుగురోజు లయ్యేసరికి ఇలాటి తంతు కలవాటు పడ్డాను.

బంధువులంతా ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు.

వంటరిగా పడుకొని ఏదో ఆలోచిస్తున్నాను. రాత్రి పదిగంటలు దాటవస్తోంది. నిద్ర దూరమయ్యింది. శ్రీలక్ష్మితో వివాహమయ్యింది మొదలు, చనిపోయిన క్షణంవరకూ, నా జీవితంలో ఆమెతో ముడివడిన రకరకాల రంగురంగుల దృశ్యాలు హృదయంలో వరుసగా మెదులుతున్నాయి.

ఉలిక్కిపడ్డాను.

"మామయ్యా! అత్తయ్యేదీ! మనల్నందర్నీ అన్యాయం చేసి పోయిందా?" నన్ను గట్టిగా వాటేసుకుని ఏడుస్తున్నాడతను. ప్రక్కనే నిల్చునివున్న ఆ అమ్మాయి - అతగాడి భార్యకాబోలు - కూడా మూలుగుతోంది.

చత్వారమూ, అందులోనూ రాత్రివేళ. చిన్న ట్రాన్సఫారమ్ బల్బు కాంతిలో, హఠాత్తుగా వచ్చిన ఆగంతుకు లెవరో గబుక్కున పోల్చుకోలేక పోయాను.

"ఉండరా నాయనా! నువ్వెవ్వరో తెలియటం లేదు. ముందా లైటు వెయ్యి" అన్నాను లేచి కూర్చుంటూ.

"అయ్యో మామయ్యా! మమ్మల్నే మర్చిపోయావా? అవునులే, శ్రీలక్ష్మమ్మత్తయ్య మరణంతో మాకే మతిపోతే? నీకు మతిమరుపు రావటంలో ఆశ్చర్యమేముంది?" అన్నాడతను మరింతగా దీర్ఘాలు తీస్తూ. ఇది పనిగాదనుకుని లేచివెళ్ళి లైటు వేశాను. ఆఁ! ఇప్పుడు గుర్తొస్తోంది. వీడు...వీడు... గోపాలం! అంటే నాచెల్లెలి, తోడికోడలి, చిన్నాయన కొడుకు! ఆ అమ్మాయి అతగాడి భార్య, లక్ష్మి! వీళ్ళిద్దరికీ నా భార్య చనిపోతే యింత దుఃఖమొస్తుందా?

"నాయనా! అసలే వృద్ధాప్యం..అందులో ఇదొకటీ.. నిన్ను గుర్తుపట్టలేక పోయానురా గోపాలం." అన్నాను నొచ్చుకుంటూ.

"ఆఁ అందుకు నే నేమనుకుంటున్నాను మామయ్యా! నీకు కలిగిన దుఃఖానికి కాస్త ఉపశమనం కలిగిద్దామని వచ్చాం. నువ్వు బెంగపడక. ఇంటి విషయాలన్నీ మేం చూచుకుంటాం.. నీకేలోటూ రానివ్వం..." గోపాలం గడగడ చెప్పేశాడు.

"అవును బాబాయ్! మీ సేవ చేస్తాం..ఇదే నాతండ్రి అయితే ఇలాటి కష్టసమయంలో వదలి వెళ్తామా? ఇక మీరు నిశ్చింతగా వుండండి" అమ్మాయి లక్ష్మికూడా వంత పలికింది,

దంపతుల అభిప్రాయం అవగాహన అయ్యింది.

"సరే" అనక తప్పలేదు. వాళ్ళిద్దరూ, అతి చొరవగా గబగబ తమ వెంట తెచ్చుకున్న సామాను ఓ గదిలో సర్దేసి,

మేడ మీద మూలగదిలో పడుకున్నారు. నాకు నిద్ర దూర మయ్యింది. ఏదో సందేహం తలెత్తింది !

ఇంకా సూర్యోదయం కాలేదు... అలవాటు ప్రకారం పెరట్లోకి వెళ్ళివస్తూ, అట్లాగే నిల్చుండిపోయాను. వీధివాకిట్లో గుర్రపుబండి ఆగింది. మరోజంట దిగివస్తున్నారు. విస్మయంగా చూస్తూండిపోయాను.

నాకు బాగా దగ్గరగా వచ్చేశారు. వాళ్ళిద్దరూ.

"బాబాయ్..." అతగాడు కుప్పలా కూలిపోయాడు ఏడుపుతో ! అతడి భార్య క్రింద చతికిలపడింది ఏడుస్తోంది ! పిల్లెవరో ? ఓహో ! నాభార్య మేనత్త ఆడబిడ్డ, తోడికోడలి మేనమామ కొడుకు మురళి. అతగాడి భార్య రేణుక ! భేష్ ! బాగుంది వరుస ! పిల్చ్యా నాకు .సేవచేయ్యటానికే కాబోలు వస్త. గంగల బండిలోంచి నలుగురు చిరంజీవులుకూడా దూకి వచ్చేశారు.

తల్లిదండ్రుల ఏడుపుచూచి, పిల్లలూ మొదలెడతా రేమో నని భయంవేసింది నాకు.

చప్పున మురళి దగ్గరకు వెళ్ళి "ఊరుకో నాయనా ! జరిగిందేదో జరిగిపోయింది. ఏడ్చి ప్రయోజన మేముంది ! ఊరుకో అమ్మా రేణుకా !'' అన్నాను.

మురళి విస్మయంగా చూశాడు. బహుశా తను అన వలసిన మాటలు నే ననటం ఆశ్చర్యాన్ని కల్గించి ఉండవచ్చు. పిల్లలేదీ అర్థంకాకుండా చూస్తున్నారు.

"బాబాయ్ ! నిన్నిలా వదిలి నే వెళ్ళలేను బాబాయ్! అందుకే రేణుకనూ, పిల్లల్నికూడా పిల్చుక వచ్చాను. అసలే

వయసు మీరినవాడివి! అది చాలదన్నట్లే ఖర్మ! నిన్నిలా వదలి నే వెళ్ళలేను..." మురళి శోకరసాలు పెంచాడు.

నాకు తెలుసు...ఎందుకొదిలి వెళ్ళరో! లోలోపల నవ్వ లేక, ఏడవలేక ఊరుకున్నాను...

## 2

ఇక మరునాటి నుంచీ అసలుకథ ప్రారంభమైంది!

నేను నిద్ర లేచేసరికి గది వాకిట్లో స్టూలుమీద పండ్ల పొడి, పెద్ద చెంబులనిండా నీళ్ళూ సిద్ధంగా ఉన్నాయి.

"ఎవరు తెచ్చిపెట్టారు చెప్మా?" అనుకునేంతలో

"మామయ్యా! పెరట్లోనరకూ నువ్వు రాలేవు. పైగా ఆ రేణుకగారి పిల్లలు ఇల్లంతా నానారభసా చేస్తారు...అందు కని నేనే స్వయంగా తెచ్చిపెట్టాను..." నా మనసులో ఆలో చన పసిగట్టినట్లు చెప్పాడు గోపాలం.

"ఎందుకు నాయనా నీకీ శ్రమ? పెరట్లోకి నడిచి వెళ్ళటం నాకేమీ భారంకాదులే..." అన్నానో లేదో.

"...నీకు తెలీదుమామయ్యా! ఈ వయసులో ఏలాటి శ్రమా నీకు పనికిరాదు, నీ అవసరాలు తీర్చడానికేగాదూ మేం వుంట?" అన్నాడు.

ముఖం కడుక్కునేసరికి తువ్వాలు అందించాడు గోపాలం. ముఖం తుడుచుకుంటూ గదిలో అడుగెట్టేసరికి రేణుక ఫల హారం, పాలు పట్టుక నిల్చుని ఉంది.

"ఇదేమిటమ్మా? నేను పాలుతప్ప మరేమీ పుచ్చుకోను రోజూ...అయినా నాకోసం..."

"దుఃఖాగ్ని అంటే సామాన్యమైందికాదు మామయ్యా! అది తట్టుకోవటానికి శరీరదార్ఢ్యం కూడా వుండాలి. మీకు వేదాంతమూ, జ్ఞానమూ చెప్పేంత ప్రజ్ఞావంతురాలినికాదు.. ఏదో ఓ ఆహారం పుచ్చుకోకుంటే నీరసం ఎక్కువైపోతుంది .."

రేణుక మాటలు ఆశ్చర్యానికంటే, ఆ లౌక్యానికి నవ్వువస్తోంది.

గోపాలం, రేణుకలు ఒకరిపై మరొకరు తీణాకలం నిప్పులు కురిపించుకోటం గమనించాను.

పేపరు చదివి విశేషాలు వినిపిస్తున్నాడు మురళీ. వద్దని మొత్తుకున్నా వినిపించుకోవటం లేదు.

బక్కెటులో వేణ్ణీళ్ళు తెచ్చి పెట్టారు లక్ష్మి, గోపాలం.

"నేనేం బాలింతరాలినా? స్నానం కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు?" అన్నాను చిరాకు అణుచుకోలేక.

"బాబాయ్! హవ్వ! పెరట్లోకి నువ్వు రావటమే? ఆ పిల్లలగోల మేమే భరించలేకుండా వున్నాం...ఇక నువ్వు!" అంది లక్ష్మి.

మురళి ఛర్రున లేచివెళ్లాడు.

గోపాలం లంకించుకున్నాడు.

“ఆ రేణుకగారు లేదూ? పెరడంతా గొప్పులు తీయిస్తోంది. చెట్లు నాటిస్తుందట! చెట్లే నాటుతారో, మనుష్యుల్నే పాతేస్తారో తెలీదు గానీ, పెరట్లో కొలిక్కి తెచ్చేసింది..”

భోజనము గదిలోకే వస్తుందేమోననే భయంతో, గబగబ వెళ్ళి వంటఇంట్లో పీటవాల్చుకు కూచున్నాను.

లక్ష్మి, రేణుకలు రేసుగుర్రాల్లా పరుగెత్తుకు వచ్చారు. ఒకరు పీట వాల్చారు. మరొకరు విస్తరివేశారు. మురళి మరచెంబుతో నీళ్లు పట్టుక వచ్చాడు. గోపాలం కుంకుమ, అద్దం, చీపురుపుల్ల తెచ్చిపెట్టాడు.

ఇక తంతు మొదలయింది.

“అత్తయ్య చేసినట్లే చేయించాను మా మయ్యా గుత్తి వంకాయకూర. లక్ష్మి, ఏదీ మరికాస్త వడ్డించు” అన్నాడు గోపాలం.

“రేణూ! బాబాయ్ కోసం ప్రత్యేకంగా చేసావుకదూ అనపకాయకూర. మర్చిపోయేవ్? కాకున్నా కాకుల్లా పక్కన మనుషులు గోలపెడ్తుంటే, వడ్డించేవాళ్ళకు మతిస్థిమిత మెక్కడుంటుందీ?” మురళి బాణం. ఒకరిపై ఒకరు విసురుకునే వాక్బాణాలతో, పోటీపడి వడ్డించే పదార్థాలతో కడుపూ, విస్తరికూడా నిండిపోయింది.

అప్పుడప్పుడూ ఇంట్లోనించి ఘర్షణకూడా విన్పిస్తోంది.

“నూజివీడు కొచ్చినప్పుడు బాబాయ్ మా యింట్లోనే వుండేవారు. ‘అమ్మాయ్ నాకెటూ పిల్లల్లేరు. మీరైనా వచ్చి

నా దగ్గర ఉండండమ్మా!' అనేవారుకూడా !'' లక్ష్మి కోసేస్తోంది.

''అసలు మామయ్యగారికి మా వారంటే తగని అభిమానం. పిల్లా పీచూలేని గొడ్డుమోతువాళ్ళున్నా ఒకటే లేకున్నా ఒకటే! పిల్లల్లేని ఇల్లు వల్లకాడు లాంటిది. 'అమ్మాయ్ రేణుకా ! మురళీ, నువ్వు, పిల్లలు వచ్చి నా యింట్లో వుండండమ్మా!' అనేవా రెప్పుడూ.'' రేణుక సమర్థింపు.

హారిభగవాన్ ! ఈ దంపతులను నేను ఆహ్వానించానా? నూజివీడు వెళ్ళినా. అనకాపల్లి వెళ్ళినా వీళ్ళక్కడ వున్నారనే గుర్తుకూడా నాకుండేదికాదు.

ఆరోజు పళ్ళు తోముకుని వస్తూ గడప తగిలి కాలివేలు కొద్దిగా రక్తం చిమ్మింది. తడిగుడ్డపీలిక కట్టాను. బాధతో అలా కళ్ళుమూసుకు పడుకుని వున్నాను.

''బాబాయ్ కాలికేమయింది?'' మురళి ప్రశ్నతో కళ్ళు తెరిచాను.

''ప్చ ! కొద్దిగా దెబ్బతగిలింది !'' నిర్లిప్తంగా జవాబిచ్చాను.

''ఆం! దెబ్బతగిలిందా!రక్తమొచ్చిందా?అమ్మయ్యో! వాసేవ్ రేణూ! ఎక్కడ చచ్చారంతా! ఒక్కక్షణం నేనింట్లో లేకపోతే కునికిపాట్లు పడుతున్నావా ? ఇలారా ! ఇటుచూడు. బాబాయ్ కాలివేలెలా రక్తంచిందుతోందో! వేణ్ణీళ్లు,లోషన్, కాస్తదూది. పెన్సిలిన్ ఆయింట్ మెంటు, బాండేజిక్లాత్ !

అన్నట్లు కాలు పెట్టుకోటానికో స్లూలూ పట్టుకురా. ఊ తర్వగా'' మురళి ఇల్లు పీకి పందిరేస్తున్నాడు.

తల పగిలిపోతోంది.

"నాయనా మురళీ ! అలా గోలచేస్తా వెందుకూ? వెధవదా చిన్నగాయం ఏంచేస్తుందీ !'' అన్నాను చిరాకుగా.

"వెధవదా! .ఏంచేస్తుందా ! కొంపలు ముంచుతుంది. సెప్టిక్ అయితే కాలు తీసేస్తారు. అసలేమిటోలే బాబాయ్ ! పిన్నిపోయింది. నీకు మతిస్థిరంకూడ తప్పుతోంది.'' కళ్లు వత్తుకున్నాడు మురళి, రాని, లేని కన్నీళ్లు బయటికి రావాలనే వ్యర్థప్రయత్నంతో. క్షణాలమీద మురళి జాబితా .చదివిన వస్తు సముదాయం వచ్చేసింది. వేలికిగాకుండా, కాలికికూడా మడిమ వరకూ కట్టుకట్టేశాడు మురళి.

మధ్యాహ్నంఫలహారం తింటున్న నేను అప్రయత్నంగా కాలు తడుముకున్నాను. ఎదురుగా కుర్చుని వున్న గోపాలం నా కాలుకేసి చూచి కెవ్వున కేక వేసాడు, "ఆకట్టేమిటి మామయ్యా?'' అంటూ హడలిపోయాను. వీడు ఇంకెన్ని వేసి కడతాడో ననిపించింది.

"అబ్బే ! కొద్దిగా వేలుగీసుకుంది. మురళి మందేదో వేసి కట్టాడులే'' అన్నానో లేదో, ఒక్క దాటున నాకాలి దగ్గరకు లంఘించాడు గోపాలం. ''ఏమిటి? మురళిగారుకూడా పెద్ద డాక్టరయిపోయా రన్నమాట ! ఆయనకేం తెలుసు? నా బొంద ! కాకున్నా గాయానికి గాలి తగులుతుంటే చప్పున

నయమవుతుంది మామయ్యా ! ఇలా బంధిస్తే, లోలోపల కుళ్ళి పోదూ?'' నా ప్రమేయం లేకుండానే బాండేజ్ పీకిపారేశాడు గోపాలం.

''అయ్యయ్యో ! ఎలా చెమటపట్టిందో చూడు, కాలు! బుద్ధితక్కువ మనిషి ఇలా కట్టుకుంటారా కట్టు !''

రెండర్థాలలో వీడు నన్నుకూడా జమకడ్తున్నాడు కాబోలు !

''అబ్బ అదే తగ్గిపోతుందిలే నాయనా ! దీనికింత హంగామా ఎందుకూ?'' అన్నానువచ్చేకోపాన్నణచుకుంటూ

''అదేం కుదరదు మామయ్యా ! అది నీ కాలుగాదు. నాది. నీ కాలిలో ముల్లుగుచ్చుకుంటే నాకంటో గుచ్చుకున్నట్లుంటుంది నాకు.''

అడ్డొస్తే ఇంకా ఇలాటి నాటకాల మాట లెన్ని వాగుతాడో నని పించి కిమ్మనకుండా చూస్తూ ఊరుకున్నాను.

లక్ష్మి నవనీతం కలుపుకువచ్చింది. వేలికి పట్టించి వదిలేశాడు గోపాలం. హమ్మయ్య ! అనుకున్నాను.

సాయంత్రం మళ్ళీ నాదగ్గరకు వచ్చిన మురళి గోపాలం మీద మండిపడ్డాడు. నా కాలు లాక్కోబోయాడు. వళ్ళు మండిపోయింది.

''నాయనా ! మీ ఇద్దరి వైద్యాలతో నాకాలు నిజంగానే పోతుంది. పరమానందయ్య శిష్యుల్లా ఏమిటీ ఘోష ?'' కోప్పడ్డాను.

మురళి రంగులు మార్చేసుకున్నాడు. "బాబాయ్ అలా కోప్పడితే ఎలా ?" అన్నాడు దీనంగా.

"నువ్వేమైనా చెప్పబ్బాయ్ ! కాలికి వైద్యం అనవసరం !" అన్నాను నిష్కర్షగా.

నెలరోజులు గిర్రున తిరిగాయి. నా తల బొప్పికట్టిపోతూంది. బాహాటంగానే తగవులాడుకుంటున్నారు గోపాలం దంపతులూ, మురళి దంపతులు.

బాబాయిగారికి మేమంటేనే ఇష్టం. తగుదునమ్మా అని గంపెడుపిల్లలతో వచ్చి చేరారుమీరు" అని లక్ష్మి అంటే-

"మామయ్యగారు మాకోసమే ప్రాణాలు వదుల్తారు. పిల్లా బీరకాయలేని మీలాటి గొడ్డుమోతు వాళ్ళంటే ఆయనకు తగని చిరాకు." అంటోంది రేణుక.

"అసలు బాబాయ్ ఆస్తికి వారసుణ్ణి నేను." అని మురళి అంటే -

"నీకో చిల్లిగవ్వకూడా దక్కనివ్వను." అంటున్నాడు గోపాలం !

అన్నీ వింటూ, ఇద్దరి చేతి వంటలు రుచిచూస్తూ, ఇరువురి చేత సేవలందుకుంటూ ఈసమస్యకో అంతంమంటూ కన్పించక ఆలోచిస్తున్నాను నేను.

పచారీకొట్టు శెట్టి వచ్చాడు.

"ఎప్పుడూ లేదు...తమరింత దుబారా చెయ్యటం. ఈ నెల మీా లెఖ్ఖ మూడువందలు దాటింది...ముందుగా మనవి చెయ్యటం మంచిదని వచ్చాను."

శెట్టి చెబుతున్నమాటలు విని దిగ్భ్రాంతి చెందాను. ఇంటో బియ్యం, కందులు, పెసలు నూనెల్లాటివన్నీ ఆరు నెలలకు సరిపడా తీయించింది శ్రీలక్ష్మి. అవి ఋణంలేకనే పోయింది, అదలా వుండనీ! ఇదేమిటి.? కేవలం చిన్న చిన్న అంగడి వస్తువులకు మూడువందల పైచిలుకు అయ్యిందా? ఎలా అయిందీ? ఆలోచించగానే స్ఫురణకు వచ్చింది! రెండు సంసారాలు, నా సేవకోసం పడేపాట్లలో ఇది మొదటిది.

"ఏమిటాలోచిస్తున్నారు బాబూ! నమ్మకం లేకుంటే, ఇదుగో పట్టీ చూడండి..." అంటున్నాడు శెట్టి.

"అబ్బే.. శ్రీమన్నారాయణా! నువ్వెప్పుడైనా అబద్ధం ఆడావా? మనిద్దరి స్నేహం నీకొట్లో నేను వస్తువులు తీసుకోటం ఈనాటిదా? అదికాదయ్యా! ప్రస్తుతం పైకం చేతిలో లేదు... వారంరోజుల్లో పంపిస్తాను ... ఈమాటెలా చెబుదామా? అని ఆలోచిస్తున్నాను..." అన్నాను.

"అదేమిటండీ! దీని కింతగా చెప్పాలా?" అతగాడు వెళ్ళిపోయాడు.

మురళీ, గోపాలం రాగానే అడిగేశాను.

"మీారిద్దరూ కలిసి ఎవరెంతెంత ఇంటిఖర్చులు చేశారో నా వాటా తీసేసి, మిగతాది యిచ్చుకోవాలి.

మురళీ, గోపాలం ముఖాముఖాలు చూచుకున్నారు. క్షణ కాలం ఇద్దరి ముఖాల్లోనూ, వినరాని మాటలు విన్నప్పుడు మనిషిలో కన్పించే మార్పే కన్పించింది నాకు.

గోపాలం సర్దుకుని జవాబిచ్చాడు. "మామయ్యా ! ఆ ఖర్చు నీమీద వేస్తామా? నేనే ఈరోజో రేపో ఇద్దామనుకుంటు న్నాను...అతగాడొచ్చాడేమిటీ నీదగ్గరకు? అయినా ఈ వర్తకులకు..."

"పోనిద్దూ అతగాడి తప్పేముంది? వ్యాపారస్తులు ముందుచూపు కలిగివుండకపోతే, వాళ్ళు వ్యాపారాలు మాను కోవాల్సిందే!" అన్నాను.

ఇద్దరూ రుసరుసలాడుతూ లేచివెళ్ళారు.

ఇదిలా వుండగా...

హఠాత్తుగా ఒకరోజు మరో ఆసామి దిగాడు. వెంట పన్నెండేళ్ళ అమ్మాయివుంది. వీళ్ళా నా సేవకొచ్చారు కాబోలని హడలిపోయాను.

ముసలాయన బంధుత్వం కలిపాడు.

మా బామ్మా, వాళ్ళ బామ్మా స్నేహితురాళ్ళట ! అంతేగాక, మా బామ్మ ఆడబిడ్డ, బావగారి, మేనమామ, బావమరది యిలాకావారట! అమ్మాయి నాకు వరసౌతుందట!

"ఏ వరస ?" అన్నాను అయోమయంగా

"అదేనండీ..." వెకిలినవ్వు నవ్వాడాయన,

"అలా పిచ్చినవ్వులునవ్వితే నాకర్థంగాదు. తెలుగులో స్పష్టంగా చెప్పండి. ఏ వరస" గద్దించాను.

"అదేనండీ...మీకిచ్చి వివాహం చెయ్యాలని..."

క్షణకాలం నిశ్చేష్టుణ్ణయ్యాను. వల్లకాటికిపోయేకాలం సమీపించిన నాకు మళ్ళీపెళ్లి! అందులోనూ పాలుగారే పన్నెండేళ్ళ పసిపిల్లతో! అర్థమయ్యింది. ఈ పెళ్లి నాతో కాదు.నాఆస్తితో. నా డబ్బుతో. అందుకే అందరి కర్తృత్వని!

నాకూ, శ్రీలక్ష్మికి వివాహమయిన మూడేళ్ల తర్వాత. మాకో మగపిల్లవాడు పుట్టిపోయాడు. వాడు బ్రతికి వుంటే, వాడికి పెళ్ళీ పేరంటమూ అయ్యుంటే, ఈ సరికి యింతే వయసుగల మనుమరాలుండేది నాకు!

జాలిగా ఆ పిల్ల వేపు చూచాను.

"నీ పేరేమిటమ్మా?" అన్నాను.

"కళ్యాణి తాతా! అందా పసిపిల్ల అమాయకంగా.

"ఛ, తాతా అనకూడదమ్మా వారిని..." ముసలాయన వారించబోయాడు.

"ముసలిపీనుగను నన్ను, 'తాతా' అనక 'బావా' అనమంటారా?..." అన్నాను ఆయనతో.

"ఏదో పిల్లపక్షి ఏమీ తెలీదు ..." ఆయన నొచ్చుకుంటూ అన్నాడు,

"నిజంగానే యీ పిల్లనిచ్చి నాకు పెళ్ళిచేస్తారా ?" అన్నాను మళ్ళీ.

ఆయన కళ్ళు ఆనందంతో మెరిసాయి క్షణకాలం.

"నాదీ ఓ కోరికుంది. అది తెలియజేసుకోవద్దూ ?" అన్నాను.

"తప్పకుండా !" అన్నాడాయన.

సదాచారా సంపన్నురాలూ, నిష్కల్మషచరితా, అయిన అరవై సంవత్సరాల బాలవితంతువును చేసుకోవాలని నాఉద్దేశ్యము..." అన్నాను.

క్షణకాలం నివ్వెరపోయాడాయన.

"పంతులుగారు... వేళాకోళం ఆడుతున్నారు. ముహూర్తాలెప్పుడు పెట్టుకుందామో శలవిస్తే, ఏర్పాట్లు చేసుకుంటాం.. పిల్లమ్మా, నాన్నా ఒకటే బెంగపడ్తున్నారు దీని పెళ్ళికోసం..."

"నాఅభిప్రాయం వినికూడా మీరింకా నామీద ఆశలు పెట్టుకున్నారన్నమాట ! అయితే ఇలారండి..."

నావెనుకే వచ్చాడు, తోటలోకి పిల్చికెళ్ళాను.

"ఇదుగో! తరతరాలుగా మాకు భుక్తికి లోటులేకుండా ధాన్యాన్ని సమకూర్చుతున్న మోటబావి... ఇందులోకి తోసెయ్యండి మీామనమరాలిని. మీా బరువూ తీరుతుంది, బిడ్డాసుఖపడ్తుంది..." అన్నాను.

"క్షమించండి బాబుగారూ! పేదరికం! ఒక్కమారుగా ఇంత ఆస్తి వస్తుందనే ఆశ...కక్కుర్తిపడ్డమాట నిజమే... మాబాగా బుద్ధిచెప్పారు ... కాని దీనితర్వాత ఇంకా ముగ్గురాడ పిల్లలున్నారు మాఅబ్బాయికి ...ఈ బరువీ రోజుల్లో ఎలా దించుకుంటామో .." ముసలాయన పశ్చాత్తాపంతో బాధతో కళ్ళనీళ్ళునింపుకున్నాడు.

హృదయం కరగిపోయింది. నిజమే ! ఈనాడు దేశవ్యాప్తంగా వున్న వరకట్నాల సమస్యతో, ఆడపిల్లలు తల్లిదండ్రులకో గడ్డుసమస్యలుగా, భరించరాని బరువుగా తయారయ్యారు...నాలాంటి శతవృద్ధుకు ఆ పిల్లను కట్టబెడదామనుకున్నారంటే... అబ్బ దుర్భరం ! ఇలా ఎందరు పసిపిల్లల కుత్తుకలు నులిమివేయ బడుతున్నాయో ! ఎందరు తలిదండ్రుల హృదయాలు ఘోషిస్తున్నాయో ! ఎందరు కన్యల ఆక్రందనలతో భారతదేశపు నలుమూలలా మకిలి పేరుకుపోతోందో !

"చూడండి! అధైర్యపడకండి. కళ్యాణికి మంచి సంబంధం చూడండి. పెళ్లికయ్యే ఖర్చు. వరుని, ఖరీదూ నేను భరించు కుంటాను...సరా ? తొందరపడి ఆ అమాయకపు పాప గొంతు కొయ్యొద్దు..." అన్నాను మనస్ఫూర్తిగా.

ఎన్నో కృతజ్ఞతలు చెప్పుకుని వెళ్ళిపోయాడాయన. నెల రోజుల్లోనే తగిన సంబంధం చూచి జాబువ్రాశాడు. వారం రోజులు ముందుగా వెళ్ళి పెళ్ళి ఏర్పాట్లు చేయించి, ఘనంగా పెళ్ళిచేయించాను.

కళ్యాణి, శేఖరం ఈడూజోడూ చక్కగా కుదిరారు. నాకు పాదాభివందనం చేస్తుంటే "కలకాలం సుఖంగా సంతోషంగా వర్ధిల్లండి" అంటూ దీవించాను. తిరిగి రాబోతూ "కళ్యాణీ! వీలున్నపుడు ఈ తాతయ్య ఇంటికి వస్తూంటావు గదమ్మా! ఏం బాబూ! శేఖరం? నా మనవరాల్ని అప్పుడప్పుడూ నాకు చూపిస్తుండూ!" అన్నాను.

"తప్పకుండా వస్తాం తాతయ్యా!" అన్నా రిద్దరూ.

తిరిగి వచ్చేశాను. ఇల్లు నానా గందరగోళంగా వుంది.

పెరట్లోకి వెళ్ళుతుంటే, నా రాక గమనించలేదు కాబోలు, లక్ష్మి, రేణుకతో అంటోంది.

"ఈ ముసలాడి కిదేం తెగులూ? ఊళ్ళోవాళ్ళందరికి పెళ్ళిళ్ళు చేయించి ఈ ఆస్తంతా ఇలాగే తగలబెట్టేస్తాడు కాబోలు!"

"మనబోటివాళ్ళం పచారీకొట్లో పెట్టిన కాతా, ముక్కుపిండి వసూలు చేశాడు ముసలి పీనుగ..."

గట్టిగా నవ్వుదామనుకుని, హడలి చస్తారని మానేశాను.

ఇంట్లో ఏమూల చూచినా కొత్తకొత్త సామాన్లు వెలుస్తున్నాయ్! అనుమానం వేసి గమనించి చూశాను... పెద్ద అండాలూ, తపాళాలు కన్పించటంలేదు! ఎవరి పనో?

సాయంత్రంవేళ నా కళ్లముందునుంచే పెద్ద అండా ఒకటి పట్టుకుపోతున్నా రిద్దరు కూలీలు.

ఒక్కసారిగా గర్జించాను.

"ఎక్కడికి ?"

"చిన్నయ్యగోరు అమ్మటానికి తెమ్మన్నారండీ! వారిప్పుడు అంగడికాడే ఉన్నారండి!" అన్నాడందులో ఒకడు.

"చిన్నయ్యగోరా ? వాడెవడు ?"

"మురళిబాబు గోరండీ! తమ వారసులంటగదా!"

కూలివాళ్ళముందు అల్లరి పడటం సబబు కాదు.

"ముందక్కడ పెట్టి, మురళిని నే రమ్మంటున్నానని చెప్పండి." అని పంపించేశాను.

మురళి వచ్చాడు. "ఎందుకు బాబాయ్! పిలిచావట?" వినయం కుమ్మరించేస్తున్నాడు నక్క వెధవ?

"ఎవరబ్బసొమ్మని అమ్ముతున్నావ్ నన్నడక్కుండా!" ఎంత వారించినా నోరు కటుత్వమే వెలువరించింది.

వెధవనవ్వు నవ్వాడు మురళి.

"అదేమిటి బాబాయ్ ! అంతా నీదేకదూ ! ఆమాట కొస్తే, ఆ గోపాలమే చొరవ తీసుకొని రెండు గంగాళాలూ, మూడు తపేలాలూ, చివరకు పూజాపీఠంలోని వెండి సామానులు కూడా అమ్మేశాడుగానీ నేనంత చొరవ చస్తేతీసుకుంటానా! కాకుంటే అడ్డమెందుకని అమ్ముదామనుకున్నాను. అదైనా ఉదయం నీకు చెబుదామనుకుంటూ నేమర్చిపోయాను."

భేష్! దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్నట్లుంది. వ్యవహారం? ఇంట్లోకి వెళ్ళి నలుగురు పెద్దల్ని సమావేశపరిచాను.

ఈ నిముషంనుంచీ యింట్లో వున్న పూచిక పుల్లయినా బయటికి పోవటానికి వీల్లేదు.'' ఖండితంగా చెప్పేశాను.

సామానంతా తీయించి ఓ గదిలోవేసి తాళంవేసి, తాళాలు నా దగ్గర పెట్టుకున్నాను.

''పోయేటప్పుడు కట్టుకపోతాడో ఏమో! ముసలి వెధవ సామానంతా తాళాలు బిగించుకున్నాడు.'' అంటోంది లక్ష్మి గోపాలంతో; ''ఉస్ ! ఊరుకుందూ ! చచ్చినాడు ఎంతో కాలం బతకడు. కాస్త ఓర్చుకొనివుంటే యీ ఆస్తీ, ఇల్లూ, అన్నీ మనకే వస్తాయి. అన్నట్లు రాబందుల్లా రేణుకా, మురళీ తన్నుకుపోకుండా చూచుకోవాలి. కాస్త ముసలాణ్ణి బుజ్జగిస్తుంటే సరిపోయే.'' గోపాలం హితోపదేశం !

నాయింటి వాసాలూ, కంఠతా పెట్టారన్నమాట !

రాత్రంతా దీర్ఘంగా ఆలోచించాను. మెరపులాటి ఆలోచన వచ్చింది.

ఉదయం మంచంమీద నుంచి లేవలేదు.

''బాబాయ్ !'' మురళి మేలుకొలుపు !

''ఒంట్లో నలతగా వుంది బాబూ !'' మూలిగాను.

మురళి తడబడిపోయాడు. వాడి హంగామాతో ఇంటిల్లిపాదీ చేరారు.

మామయ్యా! డాక్టర్ని పిల్చుకువస్తాను.'' జవాబాశించకుండా పరుగెత్తాడు గోపాలం.

"డాక్టర్ సదానందాన్ని కేకేసుకురా నాయనా !" మురళి నా నోట్లో మాట వుండగానే పరుగెత్తాడు.

డాక్టర్ వెంకటేశ్వరరావు వచ్చి పరీక్షించాడు అతడికి నాజబ్బు అంతుపట్టలేదు కాబోలు..."వృద్ధాప్యం-బలహీనత, ఆహారం బాగా యివ్వండి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

సదానందంతో తలుపులు వెయ్యమని చెప్పి... చెవిలో చెప్పాను... బాల్యమిత్రుడు ! నా బాధ అర్థం చేసుకున్నాడు.

బయటికి వెళ్ళిపోయాడు...మురళి సాగనంపివచ్చాడు.

"ఏంనాయనా!ఏమనిచెప్పాడు సదానందం?" అన్నాను.

"అబ్బే, నయమయిపోతుందని చెప్పాడు బాబాయ్ !" మురళి హృదయంలో ఆనందం గంతులు వేస్తుందని నాకూ తెలుసు...

"పిచ్చినాయనా ! నువ్వు చెప్పకున్నా నాకు తెలుసు డాక్టరేం చెప్పాడో! ముసలాడెక్కువ రోజులు బ్రతకడు, అని చెప్పాడు అవునా ?" అన్నాను.

"ఛ, ఛ అలా అనకు బాబాయ్ ! ఎంత డబ్బయినా ఖర్చు చేస్తాను...నిన్ను బ్రతికించుకుంటాను..." మురళి గావు కేకలు పెడ్తున్నాడు.

అవును వాడి సొమ్మేంపోయే ! ఎంత డబ్బయినా ఖర్చు పెట్టగలడు !

వెంకటేశ్వరరావు, సదానందం చెరోకపూటా వస్తు న్నారు. దగ్గరుండి తియ్యటి మందూ, పళ్ళరసాలూ, ఆహారాలూ, సమకూరుస్తున్నారు ఇద్దరు దంపతులూ!

"నాయనలూ! అమ్మలూ! ఎందుకిలా అహో రాత్రాలూ నాకోసం శ్రమపడ్తున్నారు?" అన్నాను. ఎందుకు చేస్తున్నారో నాకు తెలియక పోలేదు!

మామయ్యా!

బాబాయ్!

మామయ్యా!

బాబాయ్!

మనిషికి మనుషు లేమీ కారా? నిస్వార్థ సేవ, నిష్కామ కర్మ అనేమాటలకు విలువే లేదా? నీ బాగు మా బాగు కాదా? నీ ఆరోగ్యం మా భాగ్యం కాదా? నీవు లేక మేము బ్రతగ్గలమా?"

నలుగురూ చిలకల్లా పలుకుతున్న ఆ నిస్వార్థసేవకూ-నిష్కామ కర్మకూ అంతు తేలుస్తాను.

"బాబులూ! ఇక అట్టేకాలం బ్రతుకుతాననే ఆశ లేదు. దీపమున్నపుడే ఇల్లు చక్కబెట్టుకోమన్నారు. మా తాతలు. నా స్నేహితులు లాయర్ విష్ణువర్ధనాన్నీ, శ్రీనివాసరావునీ, పద్మ నాభాన్నీ పిలుచుకురండి. రాతకోతలు పూర్తి చేస్తాను."

నలుగురి కళ్ళల్లో ఆశాజ్యోతులూ, అసూయకిరణాలూ, సందేహ తరంగాలూ, ఒక్కసారిగా కన్పించి మాయ మయ్యాయి.

వేంకటేశ్వరుని ఉత్సవాల సందర్భంలో యాత్రికులకు భోజన పదార్థాలు చేసుకోవటానికి వినియోగించవలసిందిగా ఆ దేవాలయాధికారులకు మనవిచేసుకుంటున్నాను.

ఇది నా మనఃపూర్వకంగా, సంపూర్ణాంగీకారముతో, స్వాస్థ్యచిత్తముతో వ్రాసియిచ్చిన వీలునామా...

ఇట్లు
"......శర్మ"

సంతోషంతో సరదాగా అందరివేపూ చూచాను. మూర్ఛలు పోలేదుగానీ అదే పరిస్థితిలో వున్నారు !

ఉదయం నిద్రలేచే సరికి పళ్ళపొడీ, నీళ్ళూ కన్పించలేదు. ఇంటో అంతా హడావుడిగా వుంది.

గోపాలం బండిలో సామాన్లు వేయిస్తున్నాడు.

"నాయనా గోపాలం! ఎక్కడికి ప్రయాణం?" ఆశ్చర్యం నటించాను, ఊహించిన పరిణామమే అయినా !

మాకేం పనుల్లేవనుకున్నావా? అక్కడ మా అమ్మా, నాన్నా బెంగపడ్తుంటారు...మేం వెళ్ళాలి..." గోపాలానికి మాతాపితలు గుర్తొచ్చారుకాబోలీరోజు !

మీరెక్కడికి? అమ్మాయ్ రేణుకా! మురళికి తెలీకుండా నువ్వయినా చెప్పమ్మా! వాళ్ళెటూ వెళ్ళిపోయారు. ఈ వృద్ధాప్యంలో నన్నిలా ఒంటంగా వదిలి మీరంతా వెళ్తే నా గతేం కావాలి?" అన్నాను రేణుకతో,

చంకలో పిల్లాణ్ణి కసిగా పక్కన కూలేసి అన్నది రేణుక:

"మీ కేం! కోఅంటే కోటిమంది వస్తారు. వచ్చి ఎన్నాళ్లో అయింది. అక్కడ మా కొంపా గోడూ సర్దుకోవాలి..."

అరగంటలో సేవాపరాయణులంతా ఇల్లు ఖాళీచేశారు.

ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నాను.

రాత్రి కలలో శ్రీలక్ష్మి కన్పించింది. "స్వార్థంతో కుయుక్తులతో కలుషితమైన నా ఇల్లు మళ్ళీ బాగుచేశారు. నాకదే సంతోషం...నేను శరీరాన్ని త్యజించినా, మీ నీడలోనే వున్నాను." అన్నది.

కళ్ళు తెరచి చూచాను. కలే అయినా, పొందిన అనుభూతి అబద్ధం కాదనిపిస్తోంది. ఋణకాలం మురళి దంపతులూ, గోపాలం దంపతులూ కళ్లముందు మెదిలారు. పాపం! ఎంతైనా కొంత శ్రమపడ్డారు కదా? బొత్తిగా అన్యాయం చెయ్యను.

లేచి లైటువేసి, కళ్లద్దాలు పెట్టుకొని ఉత్తరాలు వ్రాయటం మొదలెట్టాను. ఇద్దరికీ ఒకే కాపీ.

"ఆశీర్వచనములు.

మీరు కోపంగా వెళ్ళిన కారణమేమిటో నాకు తెలుసు. నా ఆస్తికోసం మీరు పడిన తాపత్రయం, అందుకోసం నటించిన ప్రేమ, అతివినయం నాకు చిరాకునూ, జాలినీ కూడా కల్గించాయి. అందుకే గుణపాఠం నేర్పాలనుకున్నాను. నాయనా! ఎవరి స్వార్జితాన్నో అప్పళంగా స్వంతం చేసుకోవాలనే కాంక్ష ఆరోగ్యకరమైందికాదు. అందుకోసం ఆత్మవంచన చేసు

కుంటూ, ఆత్మాభిమానం చంపుకుని అంగలార్చటం మనుష్యులు చేయదగ్గ పనిగాదు. భగవంతుడు ఎవరికిచ్చినదానితో వారు బ్రతికినంత గౌరవం మరొకటిలేదు. కష్టపడి సంపాదించిన స్వార్జితం ఇచ్చేంత తృప్తి మరి వేటివలనా లభ్యం కాదు...ఇకమీదటేనా ఇలాటి అవివేకపు పోకడలు పోరని ఆశిస్తున్నాను.

కష్టమో సుఖమో నా కోసమూ కొంత శ్రమ పడ్డారు. కనుక నా తదనంతరం మీకు తెలియకుండా వున్న నా ఆస్తిలో "......" భాగం మీకు చెందేటట్లు వ్రాసి రిజిష్టరు చేయించాను...యింతేసంగతులు.

ఇట్లు,

"......శర్మ"

కవర్లపై అడ్రసులు వ్రాసిపెట్టి పడుకున్నాను. మీరు నమ్మండి-మానండి. ఈ రోజు నిశ్చింతగా నిద్ర తరుముకు వస్తుంది.

— ♦ —